
36వ వార్డు బీజేపీ నాయకులు, కార్యకర్తలతో వాసుపల్లి గణేష్‌కుమార్


పార్టీలో చేరిన 30వ వార్డు యువతతో వాసుపల్లి


వాసుపల్లికి మద్దతు తెలుపుతున్న ఆశయం వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు

వెల్లువలా వైఎస్సార్‌సీపీలోకి..

- సీఎం జగన్ పాలనకు మెచ్చి భారీగా పార్టీలో చేరుతున్న నేతలు, సామాన్యులు
- కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్


తనకు మద్దతు ఇస్తూ పార్టీలో చేరిన బాక్సింగ్ క్రీడాకారులతో వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : వైఎస్సార్‌సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు బాక్సింగ్ క్రీడాకారులు మద్దతు తెలిపారు. ఆశీలమెట్ట పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ సారథ్యంలో నూకాంబిక స్పాట్ లైట్ బాక్సింగ్ కోచ్ శివ ఆధ్వర్యంలో సుమారు 50 మంది క్రీడాకారులు, యువత వాసుపల్లికి మద్దతు తెలిపారు. వారికి కండువాలు కప్పి వాసుపల్లి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసుపల్లి గణేష్‌కుమార్ యువత, క్రీడాకారులకు ఎంతో సహకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్స్ సాధించిన ఎస్.శంకర్, రాష్ట్రస్థాయిలో సిల్వర్ మెడల్స్ సాధించిన ఎస్.శంకర్, రూపారాణి, హర్యానా నేషనల్ గోల్డ్ మెడలిస్ట్ మనోహర్, స్టేట్ గోల్డ్ మెడలిస్ట్ మనువర్ధన్, ఆకాష్‌లను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని మెడల్స్ సాధించి విశాఖ కీర్తిని నలుదిశలా వ్యాపింపజేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గనగళ్ల రామరాజు, పార్టీలో చేరిన బాక్సింగ్ క్రీడాకారులు సీహెచ్ మహేష్, వాసుపల్లి అఖిల్, బర్రి కొండ, బర్రి ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

పరంపరగా చేరికలు..

36వ వార్డు రంగిరీజువీధికి చెందిన బీజేపీ నేతలు వాసుపల్లి సమక్షంలో వార్డు సీనియర్ నాయకుడు మాసిపోగు రాజు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వార్డు బీజేపీ అధ్యక్షుడు ఒదూరు తులసీరావుతో పాటు 60 మంది పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వారిని వాసుపల్లి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

30వ వార్డు నుంచి..

వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం (కొండమ్మ) సారథ్యంలో సొండి నాని ఆధ్వర్యంలో సుమారు 50 మంది యువత పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి వాసుపల్లి పార్టీలోకి ఆహ్వానించారు.

వాసుపల్లికి ఆశయం వర్కర్ల మద్దతు..

ఆశయం వర్కర్స్ యూనియన్ నాయకులు వాసుపల్లికి మద్దతు తెలిపారు. యూనియన్ ప్రెసిడెంట్ సుధాతో పాటు సభ్యులు నారాయణ, శ్రీను, శివ, గోవింద్, జోసఫ్, శామ్యూల్, లక్ష్మణ్ రెడ్డి, శ్రీను, శ్రీనివాస్, ఎండీ బషీర్, ఎండీ రఫీ, వాసు, శివాజీ, శివకుమార్, మల్లన్న, రాజు, శేఖర్, ముత్యాలు తదితరులను వాసుపల్లి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


వాసుపల్లికి మద్దతు తెలియజేస్తున్న జామియా మసీదు కమిటీ ప్రతినిధులు

33వ వార్డు టీడీపీ, జనసేన నాయకులు..

వార్డు నాయకులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము, మాదాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో 33వ వార్డు నుంచి సుమారు 80 మంది టీడీపీ, జనసేనకు చెందిన మహిళలను వాసుపల్లి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పద్మానగర్ శెట్టి బలిజ సంఘం మద్దతు..

జేసీఎస్ మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో పద్మానగర్ శెట్టిబలిజ సంఘం నుంచి వంద మంది పార్టీలో చేరారు. వారిని వాసుపల్లి కండువాలతో పార్టీలోకి ఆహ్వానించారు.

వాసుపల్లికి మైనార్టీల మద్దతు..

39వ వార్డుకు చెందిన ఎండీ అఫ్సర్‌ఖాన్ ఆధ్వర్యంలో వార్డు మైనార్టీలు వాసుపల్లికి మద్దతు తెలిపారు. వారిని వాసుపల్లి సత్కరించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీలు మాట్లాడుతూ మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించింది దివంగత నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి అని తెలిపారు. అగకుండా వరాలు ఇచ్చే వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు.

వాసుపల్లికి జామియా మసీదు ప్రతినిధుల మద్దతు..

చెంగల్రావు పేట జామియా మసీదు కమిటీ వాసుపల్లికి తమ మద్దతు తెలియజేసింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వాసుపల్లిని సత్కరించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలను గుర్తించారన్నారు. నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీలకు ఎటువంటి సమస్య వచ్చినా వాసుపల్లి ముందుంటారని కొనియాడారు.


33వ వార్డు జనసేన, టీడీపీ మహిళలతో వాసుపల్లి


వాసుపల్లికి మద్దతు తెలియజేస్తున్న శెట్టి బలిజ సంఘం ప్రతినిధులు


వాసుపల్లికి మద్దతు తెలుపుతున్న మైనార్టీ నాయకులు

నేడు 'వాసుపల్లి' నామినేషన్


వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : వైఎస్సార్‌సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థిగా వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం నామినేషన్ వేయనున్నారు. ఉదయం 9 గంటలకు ఉత్తరాంధ్ర కల్పవల్లి కనకమహాలక్ష్మి పాదాల చెంత నుంచి నామినేషన్ ఉత్సవం ప్రారంభం కానుంది. ముందుగా సిరులతల్లికి వాసుపల్లి ప్రత్యేక పూజలు జరపనున్నారు. అనంతరం అక్కడి నుంచి ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి (ఘోషా), పంజా జంక్షన్, టౌన్‌కొత్తరోడ్డు, రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డు, వెలంపేట, పెరికివీధి మీదుగా పూర్ణామార్కెట్ వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మకు ప్రత్యేక పూజలు జరపనున్నారు. అమ్మ ఆశీస్సుల అనంతరం భారీ ఊరేగింపుగా కల్లుపాకలు, పోలీస్ బ్యారెక్స్ మీదుగా టర్నర్ చౌల్ట్రీ వరకు ర్యాలీ నిర్వహించి ముఖ్య నేతలతో కలిసి టర్నర్ చౌల్ట్రీలో గల తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి రిటర్నింగ్ అధికారి (ఆర్‌వో) సీతారామ్మూర్తికి నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా జగనన్న పిలుపు మేరకు నామినేషన్ ప్రక్రియకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే నియోజకవర్గంలో అన్ని వార్డులు పర్యటించానని, మంచి స్పందన లభించడం సంతోషకరమన్నారు. తనతో పాటు వార్డు కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, నాయకులు వారి వార్డుల్లో తన గెలుపునకు కృషి చేస్తుంటే రెట్టింపు ఉత్సాహం వస్తుందన్నారు.

సింహగిరికి కల్యాణ శోభ

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ శోభతో శుక్రవారం సింహగిరి కాంతులీనింది. గిరి అంతా భక్తజన సంద్రమైంది. మధ్యాహ్నం 3 గంటలకు కొట్నాల ఉత్సవంతో కల్యాణోత్సవ ఘట్టాలు రాత్రి జరిగిన కల్యాణోత్సవ వేడుకతో ముగిశాయి. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామివారి కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించి తరించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాస మూర్తి, అర్చకులు పసుపు కుంకుమలు దంచి కొట్నాల ఉత్సవం నిర్వహించారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద గరుడాళ్వార్ చిత్రపటాన్ని ఎగురవేసి ధ్వజారోహణ గావించారు. తదుపరి సింహగిరి మాడ వీధుల్లో ఎదురు సన్నాహోత్సవం, రథోత్సవం, నృసింహ మండపంలో కల్యాణోత్సవం వైభవంగా జరిగాయి.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయం ప్రారంభం


వార్డు కార్యాలయంలో కార్యకర్తలతో అలపన కనకరెడ్డి

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డులో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని వార్డు ఇన్‌చార్జి అలపన కనకరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ ప్రచార నిమిత్తం ఈ కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. పార్టీ శ్రేణులంతా కార్యాలయానికి రోజూ విధిగా రావాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు ఆదివిష్ణు, సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు, బూత్ ప్రెసిడెంట్లు, కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రీరామ నవమి వేడుకలు

అల్లిపురం : బంగారుమెట్టలోని శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం ఆధ్వర్యంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు. సమాజం సభ్యులు పాల్గొన్నారు. శనివారం చిన్నారుల భక్తి సంగీత కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సమాజం అధ్యక్ష, కార్యదర్శులు భీమరశెట్టి రమేష్, భీశెట్టి హనుమంతరావు తెలిపారు.

చైత్ర పౌర్ణమి పూజలకు సిద్ధం

- 22న రథోత్సవం
- ప్రధాన జాతరకు ఏర్పాట్లు


ఉత్సవానికి సిద్ధమైన సుబ్రహ్మణ్యస్వామి

కంచరపాలెం: చైత్రమాస శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 22 సోమవారం సుబ్రహ్మణ్యస్వామి చైత్ర పూర్ణిమ మహోత్సవాలు కార్తికేయ శరవణ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవాల రాజుకృష్ణ తెలిపారు. ఈ మేరకు కంచరపాలెం ఊర్వశికూడలి రవీంద్రనగర్ సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో కలశ స్థాపన, విఘ్నేశ్వరపూజ, మండపరాధన, ముత్తయిదువుల చేతులమీదుగా ఊంజల సేవ ఉంటుందన్నారు. అనంతరం క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు, స్కందవేద హోమం తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. స్వామివారిని సాయంత్రం ఊర్వశికూడలి ఆలయం నుంచి కంచరపాలెం నేతాజీ కూడలి వరకు తిరుగు రథోత్సవం నిర్వహిస్తామన్నారు. ఆలయం వద్ద చలివేంద్రాలు, అన్న ప్రసాద వితరణలకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

'ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్'పై చిత్రలేఖన పోటీలు రేపు

మద్దిపాలెం: ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎకో వైజాగ్‌లో భాగంగా ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్ అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్న చిత్రలేఖన పోటీలను జయప్రదం చేయాలని ఏపీ పీసీబీ సీనియర్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ జి.నాగిరెడ్డి పిలుపునిచ్చారు. పీసీబీ కార్యాలయంలో శుక్రవారం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న మాధవధార కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో చిత్రలేఖన పోటీలు జరుగుతాయని తెలిపారు. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. డ్రాయింగ్ షీట్లను పీసీబీ ఇస్తుందని చెప్పారు. ఎండలను దృష్టిలో పెట్టుకుని తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్లు వీరేంద్రకుమార్, కరుణరేఖ, గ్రీన్ క్లయిమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, వలంటీర్ రవితేజ, యాక్షన్ ఎయిడ్ ఫెలోషిప్ ప్రతినిధి కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు బి-ఫారాల అందజేత


బి-ఫారం అందుకుంటున్న సూరాడ ఎల్లాజీ


విమలకు బి-ఫారం అందజేస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి

దాబాగార్డెన్స్ : సార్వత్రిక ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ట్రాన్స్‌జెండర్ నాయకుడు సూరాడ ఎల్లాజీకి శుక్రవారం ఆ పార్టీ నేతలు బీ-ఫారం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి, ఉత్తరాంధ్ర మహిళా అధ్యక్షురాలు జాలాది విజయ మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ ఇవ్వని విధంగా ఒక ట్రాన్స్‌జెండర్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చామన్నారు. అభ్యర్థి ఎల్లాజీ మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో ఒక ట్రాన్స్‌జెండర్‌ను గుర్తించి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం గొప్ప విషయమన్నారు. సమాజంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొంటున్న ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి కృషి చేస్తున్న తనకు నియోజకవర్గ ప్రజలు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ నెల 22న టర్నర్ చౌల్ట్రీలో గల తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తున్నట్టు చెప్పారు. పార్టీ శ్రేణులు, అభిమానులు తరలి రావాలని కోరారు.

అత్తిలి విమలకు..

అల్లిపురం : సీపీఐ విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమలకు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి బి-ఫారం అందజేశారు. శుక్రవారం అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆమె శనివారం తన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని రాఘవేంద్రరావు, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు క్షేత్రపాల్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి


మద్దిలపాలెంలో నిల్వ నీటిని పరిశీలిస్తున్న సిబ్బంది

మద్దిలపాలెం : దోమల వృద్ధిని అరికట్టడానికి ఇంటి పరిసరాలలో నీటి నిల్వలను ప్రతి శుక్రవారం తొలగించాలని జిల్లా మలేరియా విభాగం హెల్త్ అసిస్టెంట్ శేషుబాబు సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మద్దిలపాలెం పరిసరాల్లో నీటి నిల్వల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో నీటి నిల్వ ద్వారా దోమల ఉత్పత్తి చెందే విధానంపై అవగాహన కల్పించారు. ఈ మేరకు కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రతి శుక్రవారం విధిగా నీటి నిల్వల తొలగింపు ప్రక్రియను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రామునాయుడు, ఏఎన్‌ఎం, ఆశా, జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ పటిష్టతకు కొత్త పరికరాలు


బ్రీత్ ఎనలైజర్లను ప్రారంభిస్తున్న సీపీ రవిశంకర్

బీచ్ రోడ్డు: నగరంలో ట్రాఫిక్‌ను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు భారీ సంఖ్యలో ట్రాఫిక్ నియంత్రణ పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చామని సీపీ రవిశంకర్ అయ్యర్ తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని పోలీసు స్టేషన్ల కోసం కొనుగోలు చేసిన బ్రీత్ ఎనలైజర్స్, వీల్ లాక్స్, బాడీ వార్న్ కెమెరాలు, రేడియం జాకెట్స్, బటన్ లైట్లను శుక్రవారం ఆర్కే బీచ్ వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నిర్వహణకు మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు ఈ పరికారాలు ఎంతో దోహపడతాయన్నారు. చాలా మంది యువకులు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని, దీన్ని అరికట్టేందుకు 200 బ్రీత్ ఎనలైజర్స్‌ను కొనుగోలు చేశామన్నారు. రహదారులపై పార్కింగ్ చేసే వాహనాల కోసం 200 వీల్ లాక్స్‌ను కొనుగోలు చేశామన్నారు. వీటితో పాటు పోలీసుల కోసం 200 బాడీ వార్న్ కెమెరాలు, 400 రేడియం జాకెట్స్, 400 బటన్ లైట్లను కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో సిద్ధ ఆయుర్వేద వైద్య శిబిరం

మద్దిలపాలెం : సిద్ధ ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్నామని ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ప్రతినిధి డి.సుబ్రహ్మణ్యం వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని విశాలాక్షినగర్‌లోని బీవీకే జూనియర్ కళాశాల వద్ద ఆయా తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. మోకాళ్ల నొప్పులు, వెన్నుముక నొప్పి, మెడ నొప్పి, భుజాల నొప్పి, కీళ్ల నొప్పులున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విశాఖ స్టీవ్‌డోర్స్ నూతన కమిటీ ఎన్నిక


నూతన అధ్యక్షుడు సాంబశివరావు

దాబాగార్డెన్స్ : విశాఖ స్టీవ్‌డోర్స్ అసోసియేషన్ నూతన ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నిక శుక్రవారం జరిగింది. శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ ఎండీ డాక్టర్ జి. సాంబశివరావును అధ్యక్షుడిగా, ఒరిస్సా స్టీవ్‌డోర్స్ కంపెనీ ప్రతినిధి జేకే నాయక్‌ను కార్యదర్శిగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా గంగిరెడ్డి షిప్పింగ్ కంపెనీ ప్రతినిధి కె. సత్యనారాయణరెడ్డి, ఇంటిగ్రల్ ట్రేడింగ్ అండ్ లాజిస్టిక్స్ ప్రతినిధి జి. రాజేష్, సహాయ కార్యదర్శులుగా బోత్రా షిప్పింగ్ సర్వీసెస్ ప్రతినిధి ఎన్‌వీజే కిరణ్, లక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన సీహెచ్ వెంకట్రావు ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా డి. శ్రీనివాస రెడ్డి(శ్రీనివాస ట్రాన్స్‌పోర్ట్), కె. రోహిత్ (కేఆర్ అండ్ సన్స్), పి. రాహుల్(ప్రీమియేచర్ షిప్పింగ్ సర్వీసెస్), ఎం. భూపేష్ (నవ్‌షిప్ మెరైన్ సర్వీసెస్)ను ఎన్నుకున్నారు.

నోటీస్ బోర్డుల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల వివరాలు

ఎంవీపీ కాలనీ: పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్ట్ వైద్యుల వివరాలు నోటీస్ బోర్డుల్లో పొందుపరచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం నగరంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల స్పెషలిస్ట్ వైద్యులతో తన కార్యాలయం నుంచి ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్‌వో మాట్లాడుతూ స్పెషలిస్ట్ వైద్యుల పేర్లు, వారు ఏ రోజు, ఏ సమయంలో ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉంటారో కచ్చితంగా నోటీసు బోర్డులో పొందుపరచాలన్నారు. ఆయా వివరాలను ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు తెలియజేయాలని సూచించారు. దీనిపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ముందుగా మందులు నిల్వ చేసుకోవడం, వాటిని రోగులకు ఉచితంగా పంపిణీ చేయడం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ


క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్లు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

బ్రిటిషర్లకు ఎదురొడ్డిన ధీశాలి గౌతు లచ్చన్న


గౌతులచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దాబాగార్డెన్స్ : సర్దార్ గౌతు లచ్చన్న రాజకీయ జీవితం విశాఖ నుంచే ప్రారంభమైందని విశాఖ జిల్లా శ్రీశయన సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు తోట వాసుదేవరావు తెలిపారు. గౌతు లచ్చన్న 18వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం జడ్జి కోర్టు సమీపాన గల గౌతు లచ్చన్న విగ్రహానికి ఆయనతో పాటు అత్తిలి శంకర్రావు, రవీశ్వరరావు తదితర బీసీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ బ్రిటీష్ వారిని ఎదిరించి ఎన్నో సార్లు జైలు శిక్ష అనుభవించారన్నారు. దేశం కోసం పోరాడిన వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న అన్నారు. ఆయన పేరిట కమ్యూనిటీ హాల్, కల్యాణ మండపం ఏర్పాటు, అనకాపల్లి రోడ్డులో 5 ఎకరాల స్థలంలో స్మారక భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బంటుపిల్లి కృష్ణగిరి జోగారావు, తోట హరికృష్ణ, జలుమూరి చిట్టిబాబు, మద్ది ప్రసాద్, దొంపక భాస్కరరావు, శ్రీశయన యువత పాల్గొన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అల్లిపురం : ఆర్కే బీచ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మహారాణిపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నోవాటెల్ ఎదురుగా బీచ్‌లో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి సముద్ర జలాల్లో తేలియాడుతు కనిపించాడు. ఆ సమయంలో బీచ్‌గార్డుగా పని చేస్తున్న మరుపల్లి ధనరాజు మృతదేహాన్ని గమనించి మహారాణిపేట పోలీసులకు సమాచారం అందజేశారు. అనంతరం మరో బీచ్‌గార్డ్ ఎర్ని రాజు సహాయంతో మృతదేహాన్ని బయటికి తీసుకువచ్చాడు. మృతుడు సుమారు 50 నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్నాడని, స్కైబ్లూ కలర్ షర్టు, బ్లూ కలర్ జీన్ ప్యాంట్ వేసుకుని ఉన్నాడని తెలిపారు. అతని వద్ద మరో ఆధారం లేకపోవటంతో మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 9440796010, 9440796052 నంబర్లలో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.